



మరోసారి పేదలను అడ్డుకున్న ఫారెస్టు రేంజర్

విభజించి పాలించేందుకే... సిఎఎ

లౌకికవాదుల మండిపాటు

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బిజెపి ప్రభుత్వం హడావిడిగా తీసుకొచ్చిన భారత పౌరసత్వ సవరణ (సిఎఎ) చట్టం విభజించి పాలించేందుకేనని ముస్లీం మైనార్టీలు, మేధావులు, లౌకికవాదులు మండిపడ్డారు. దీనివల్ల దేశ ప్రజలకు ఏమాత్రం ఉపయోగం లేదన్నారు. బిజెపి మూడోసారి అధికారంలోకి రావడానికి పాచికగా సిఎఎ చట్టాన్ని వాడుకుంటోందన్నారు. 2020లో ఈ చట్టాన్ని తీసుకొచ్చి అమలు చేయడానికి ప్రయత్నిస్తే దేశవ్యాప్తంగా ఆందోళనలు పెల్లుబకడంతో వెనక్కి తీసుకుందన్నారు. సిఎఎ చట్టాన్ని అమలు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో 'ప్రజాశక్తి' లౌకికవాదులను పలకరించగా మరోసారి ఆందోళనకు సమాయత్తం అవుతున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ సిఎఎ చట్టాన్ని వ్యతిరేకించి, తాము చేసే పోరాటానికి అండగా నిలవాలని కోరారు. **ప్రజాశక్తి - తిరుపతి టౌన్, శ్రీకాళహస్తి**

ప్రజాస్వామ్యవాదులంతా ఏకమవ్వాలి


రఫీ హిందుస్తానీ, జీవకోన



బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన సిఎఎ చట్టాన్ని ప్రజాస్వామ్యవాదులంతా వ్యతిరేకించాలి. 2020లో ఈ చట్టాన్ని బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చినపుడు తిరుపతి ఆర్డీవో కార్యాలయం వద్ద 42 రోజుల పాటు శాంతియుతంగా ఆందోళన చేశాం. మేధావులు, కవులు, రచయితలు అందరూ సంఘీభావం తెలిపారు. ఈ చట్టం కావాలని ఎవరూ కోరుకోవడం లేదు. బిజెపి లబ్ది కోసమే చట్టాన్ని తీసుకొచ్చారు. రద్దు చేసేంత వరకూ పోరాడతాం.

బిజెపి ప్రయోజనాల కోసమే

చింతామోహన్, కేంద్ర మాజీ మంత్రి



సిఎఎ చట్టం బిజెపి రాజకీయ ప్రయోజనాల కోసమే. మూడోసారి అధికారంలోకి రావడం కష్టమని తెలిసే బిజెపి హిందూ ముస్లీంల మధ్య మత విద్వేషాలు రెచ్చగొట్టడానికే ఈ చట్టాన్ని తీసుకొచ్చింది. మూడేళ్ల క్రితం ఈ చట్టాన్ని తీసుకొచ్చినపుడు దేశవ్యాప్తంగా నిరసనలతో దద్దరిల్లింది. ఇపుడు మళ్లీ అదే చట్టాన్ని తీసుకొచ్చి దేశ ప్రయోజనాల కోసం కాకుండా ముస్లీం, మైనార్టీలు, దళితులు, క్రిష్టియన్లను ఇబ్బందులకు గురిచేయాలని చూస్తోంది. ఈ పదేళ్లలో బిజెపి ప్రభుత్వం ఎన్నో చట్టాలను తీసుకొచ్చి దేశ ప్రతిష్టను దిగజార్చింది. సిఎఎ చట్టం పనికిమాలిన చట్టం.


ముస్లీం మైనార్టీల నిరసనలో మాట్లాడుతున్న పి.అంజయ్య(ఫైల్‌ఫొటో)

లౌకికవాదులు తిప్పికొట్టాలి

పి.అంజయ్య, రిపబ్లికన్ పార్టీ



బిజెపి ప్రభుత్వం రాజకీయ ప్రయోజనం కోసమే ఈ చట్టాన్ని తీసుకొచ్చింది. మత విద్వేషాలు రెచ్చగొట్టేందుకు కుట్ర పన్నుతోంది. సిఎఎ చట్టాన్ని రద్దు చేయాలని లౌకికవాదులంతా ఏకమవ్వాలి. ఈ చట్టం వల్ల ముస్లీంలు, క్రిష్టియన్లు, దళితుల హక్కులను కాలరాసేలా ఉంది. ఈ దేశం నుంచి ముస్లీంలను వెళ్లగొట్టడానికి బిజెపి కుట్ర పన్నుతోంది. దేశంలో మతం పేరుతో దాడులు జరుగుతున్నాయి. బిజెపి మౌనంగా ఉంటూ ఇలాంటి చట్టాల ద్వారా అగ్గికి ఆజ్యం పోస్తోంది. చట్టం అమలు కాకుండా సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలి. రాబోయే ఎన్నికల్లో బిజెపికి గెలుపు కష్టంగా ఉండటం వల్లనే సిఎఎ చట్టాన్ని తీసుకొచ్చింది.

ఎన్నికల కోసమే..

వి.నాగరాజు, సిపిఎం జిల్లా కార్యదర్శి



బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ చట్టం కేవలం ఎన్నికల లబ్ది కోసమే. దేశంలో మత విద్వేషాలు పేరుతో రెచ్చగొట్టి లబ్ది పొందాలని చూస్తుంది. సిఎఎ చట్టాన్ని సిపిఎం మొదటినుంచి వ్యతిరేకరిస్తూనే ఉంది. గతంలో జరిగిన ఆందోళనల్లోనూ సిపిఎం ప్రత్యక్షంగా పాల్గొంది. మోడీ ప్రభుత్వ పాలనలో దేశ ప్రజలు విసిగిపోయారు. రానున్న ఎన్నికల్లో బిజెపికి ఓటమి భయం పట్టుకుంది. అందుకోసమే సిఎఎ చట్టం పేరుతో లబ్ది పొందాలని చూస్తోంది. ప్రజాస్వామ్యవాదులంతా తిప్పికొట్టాలి. చట్టం రద్దయ్యేవరకూ సిపిఎం ఉద్యమిస్తుంది.

ఆర్ఎస్ఎస్ సానుభూతి కోసమే

మురళి, సిపిఐ జిల్లా కార్యదర్శి



బిజెపి ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ సంతోషం కోసమే సి ఏ ఏ చట్టాన్ని అమలు చేస్తుంది. నాలుగు సంవత్సరాల క్రితం ఈ చట్టాన్ని తీసు కొచ్చినప్పుడు దేశ వ్యాప్తంగా లౌకికవాదులంతా ఉద్యమించారు. దేశ ప్రయోజనాలు పక్కనపెట్టి బిజెపి తన సొంత ప్రయోజనాల కోసం ఈ చట్టాన్ని తీసుకువచ్చి హిందువుల ఓట్లను కొల్లగొట్టడానికి కుట్ర పన్నింది. మణిపూర్‌లో గత కొన్ని నెలలుగా అల్లర్లు జరుగుతున్న దాన్ని అదుపు చేయలేని పరిస్థితిలో కేంద్రం ఉంది. సిఎఎ చట్టం రద్దయ్యే వరకూ సిపిఐ మైనార్టీలకు అండగా ఉంటుంది.

మతపరమైన గొడవలు సృష్టించడానికే : ఐఎస్ మౌల మజీద్ ఎ నూరాని

బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ముస్లీంపై ఏదో ఒక విధంగా దాడులు చేస్తూనే ఉంది. సిఎఎ చట్టం తీసుకొచ్చి హిందూ ముస్లీంల మధ్య గొడవలు సృష్టించి రానున్న ఎన్నికల్లో లబ్ది పొందడానికే కుట్ర పన్నారు. ముస్లీంలు ఎవరూ బిజెపి ప్రభుత్వాన్ని సమర్థించడం లేదు. ఎన్నికల్లో ముస్లీంల సత్తా ఏమిటో ఓటు రూపంలో తెలియజేస్తాం. సిఎఎ వ్యతిరేకించే రాజకీయ పార్టీలకే మా మద్దతు ఉంటుంది. చట్టం రద్దయ్యే వరకూ అందరూ సహకరించాలి.

చట్టం రద్దయ్యేవరకూ పోరాడతాం : మౌలానా మజీదే, తిరుపతి

కేంద్రం తీసుకొచ్చిన సిఎఎ చట్టాన్ని ప్రతి ముస్లీం వ్యతిరేకిస్తున్నారు. ఈ చట్టం రద్దు చేసేంత వరకూ పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మూడేళ్ల క్రితం ఈ చట్టాన్ని తీసుకొచ్చినపుడు తిరుపతి మసీదులో ఉండే ముతవల్లిలు, ముస్లీం పెద్దలు నగరంలో ర్యాలీ నిర్వహించారు. ధర్నాలు, రాస్తారోకోలు చేశారు. మసీదులో ప్రార్థనలతో నిరసనలు తెలిపారు. ఇపుడూ అదే పద్ధతులు పాటిస్తాం. దేశంలో హిందూ ముస్లీంలు కలసి మెలసి ఉన్నారు. ఈ చట్టం ఎవరికీ అవసరం లేదు.

సిఏఏ ఎన్నికల డ్రామా: ఎస్ఎం షరీఫ్, ప్రజాతంత్ర వాది



భారత పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ)ను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆగమేఘాలపై అమలు చేయాలని చూడడం ఎన్నికల డ్రామానే. అనాదిగా బిజెపికి వ్యతిరేకంగా ఉన్న ముస్లిం మైనారిటీలపై ఉక్కు పాదం మోపేందుకు మోడీ ప్రభుత్వం ఈ చట్టాన్ని ముందుకు తీసుకొచ్చింది. 1956 భారత పౌరసత్వ చట్టం ప్రకారం భారత పౌరసత్వం కోరే శరణార్థులకు కొన్ని నిబంధనల మేర పౌరసత్వం ఇచ్చే వెసులుబాటు ఉండేది. అయితే బిజెపి ప్రభుత్వం 2019లో తీసుకొచ్చిన సీఏఏ చట్టం భారత్ పొరుగు దేశాల నుంచి వచ్చే హిందువులు, క్రైస్తవులు, సిక్కులు, పార్శీలు, జైనులు, బౌద్ధులకు మాత్రమే భారత పౌరసత్వం వర్తించేలా చేయడం దుర్మార్గమైన చర్య. భిన్నత్వంలో ఏకత్వాన్ని కోరే భారతదేశానికి శరణార్థులుగా వచ్చే ముస్లింలకు మాత్రం సిఏఏ చట్టం వర్తించకపోవడం ముమ్మాటికి బిజెపి ఎన్నికల కుట్రే.

సిఏఏ చట్టంపై టిడిపి సమాధానం చెప్పాలి : గాదిపాకుల కిరణ్, వైసిపి ఎస్సీ సెల్



దేశవ్యాప్తంగా కేంద్రంలో చేస్తున్న పౌరసత్వ సవరణ బిల్లుపై బిజెపితో జతకడుతున్న టిడిపి, జనసేన తమ వైఖరి చెప్పాలనీ, ఆ తర్వాతే ప్రజల వద్దకు ఓట్ల కోసం వెళ్లాలి. ముస్లిం మైనార్టీల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్న పౌరసత్వ చట్ట సవరణ బిల్లుపై ఆ రెండు పార్టీలు తమ వైఖరిని చెబితేనే ప్రజలు వద్దకెళ్లి ఓటడిగే హక్కు వారికి ఉంటుంది.

సర్వేనంబర్ 12(1) పెట్లూరు పేదలకే..


చదును చేస్తున్న వ్యవసాయ కూలీలు
మరోసారి అడ్డుకున్న ఫారెస్టు రేంజర్
సాగుచేసి తీరుతామని పేదలు పట్టు

ప్రజాశక్తి - వెంకటగిరి రూరల్

సర్వే నంబర్ 12(1) రెవెన్యూ భూమి పెట్లూరు పేదలకే దక్కాలని, చెట్టు పుట్ట నరికి చదును చేసి సాగు చేసి తీరుతామని సిపిఎం నాయకులు వడ్డిపల్లి చెంగయ్య అన్నారు. బడుగు బలహీన వర్గాల వారు ఎన్నో ఏళ్లుగా ఆ భూమిలో చెట్టు పుట్ట కొట్టి సాగు చేయడానికి ప్రయత్నించడం, ఫారెస్టు అధికారులు అడ్డుకోవడం తంతుగా మారిందన్నారు. బుధవారం వెంకటగిరి ఫారెస్టు రేంజర్ రాజేంద్రప్రసాద్ సిబ్బందితో వచ్చి సర్వే నంబర్ 12 (1)లో చెట్లు తొలగించవద్దని అడ్డుకున్నారన్నారు. అయితే పేదలు జైలుకైనా వెళతామని, భూమిని వదులుకోబోమని, ఎన్నో ఏళ్లుగా భూమి లేని నిరుపేదలుగా బడుగు బలహీన వర్గాల వారిగా మిగిలిపోయామన్నారు. సాగుచేసి తీరుతామని నినాదాలు చేశారు. ఫారెస్టు రేంజర్ మాట్లాడుతూ సమగ్ర విచారణ జరిపి జాయింట్ సర్వే నిర్వహించి ప్రభుత్వ మేత పోరంబోకు భూమి అయితే వదిలిపెడతామని, 1960 గెజిట్ ప్రకారం రిజర్వు ఫారెస్టు భూమిగానే ఈ భూమి ఉందన్నారు. ఈ సందర్భంగా చెంగయ్య మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా జాయింట్ సర్వే చేస్తామని చెబుతూనే నిర్లక్ష్యం ప్రదర్శించారన్నారు. 1977లో ఆనాటి ప్రభుత్వం ఇచ్చిన చట్ట ప్రకారం బడుగు బలహీన వర్గాలు సాగుచేసుకునే హక్కు ఉందని, ప్రభుత్వం రక్షణ కల్పించాలన్నారు. పేదలు భూముల్లోకి వెళ్లకుండా అడ్డుకోవడం సరికాదన్నారు. భూమిలేని నిరుపేదలకు ఒక్కో కుటుంబానికి 2 ఎకరాల చొప్పున సాగు భూమి పంచిపెట్టాలన్నారు. ఎన్నేళ్లని ఎదురుచూడాలని, ప్రభుత్వం ఇవ్వకపోగా అడ్డుకుంటూ తమ బతుకులను మరింత ఛిద్రం చేస్తోందన్నారు. ఎంతోమంది కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు మారినా జాయింట్ సర్వే చేసి పేదలకు పంచడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందన్నారు. అధికారులు భూపంపిణీ చేయకపోతే, తామే ఎర్రజెండాలు పాతి సాగు చేసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జార్లపాటి రమణయ్య, వ్యవసాయ కూలీలు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి అనుసరించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్



రానున్న సార్వత్రిక ఎన్నికలు 2024కు సంబంధించి వివిధ రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పక అనుసరించాలని, ఎన్నికల సన్నద్ధతపై అన్ని ఏర్పాట్లు చేపడుతున్నామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి. లక్ష్మీ శ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరం నందు కలెక్టర్ ఆధ్వర్యంలో క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్స్, ఎన్నికల సన్నద్ధత పై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల పరిధిలోని పోలింగ్ కేంద్రాలలో మౌలిక సదుపాయాలు కల్పించామని, అయినప్పటికీ మరొకసారి ఈఆర్ఓ లు సరి చూసుకోవాలని తెలిపారు. సిఈఓ వారి అనుమతించిన ఓటరు జాబితా నుండి తొలగింపులు నియోజక వర్గాల వారీగా 120-గూడూరు 538, 121-సూళ్లూరుపేట 605, 122-వెంకటగిరి 744, 166-చంద్రగిరి 1680, 167-తిరుపతి 856, 168-శ్రీకాళహస్తి 571, 169-సత్యవేడు 76 అనుమతి సూచనలు అందాయని తెలిపారు. సార్వత్రిక ఎన్నికలు 2024 లో వినియోగించే వాటికి జిల్లా ఎన్నికల అధికారి తిరుపతి వారి ద్వారా నిర్ధారించిన ధరల పట్టిక రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందించి వివరించారు. వివిధ రాజకీయ పార్టీలు, ఎన్నికల అభ్యర్థి వారు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పక అనుసరించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు నిష్పాక్షిక ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. డిఆర్ఓ పెంచల కిషోర్, ఈఆర్ఓ లు అదితి సింగ్, చంద్రముని, నిషాంత రెడ్డి, కిరణ్ కుమార్, రవి శంకర్ రెడ్డి పాల్గొన్నారు.

తిరుచానూరు పార్కింగ్ టెండర్ ఖరార్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుచానూరు పంచాయతీ పరిధిలో బుధవారం జరిగిన పార్కింగ్ టెండర్ రెండు కోట్ల 89 లక్షల ఆరు వేల రూపాయలకు ఖరారు అయింది. బుధవారం మధ్యాహ్నం జరిగిన టెండర్ లో ధరణి అండ్ కో సంస్థకు చెందిన యజమాని నాగిరెడ్డి కైవసం చేసుకున్నాడు. గత ఏడాదితో పోలిస్తే 11 లక్షలు 600 రూపాయలు అధికంగా ఈ ఏడాది టెండరు దక్కించుకున్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతోనే ఆరోగ్యం


నారీ రూరల్ మార్ట్‌ను ప్రారంభిస్తున్న నాబార్డ్ జిల్లా అభివృద్ధి మేనేజర్ సి సునీల్ కుమార్

ప్రజాశక్తి - రామచంద్రాపురం

ప్రకృతి వ్యవసాయంతో తయారుచేసిన ఆహార ఉత్పత్తులతోనే ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని నాబార్డ్ జిల్లా అభివృద్ధి మేనేజర్ సి.సునీల్ అన్నారు. బుధవారం సి రామాపురంలో నాబార్డ్ ఆర్థిక సహాయముతో నూతనంగా ఏర్పాటు చేసిన నారీ రూరల్ మార్ట్‌ను సి సునీల్, ప్రకతి వ్యవసాయ శాఖ డిపిఎం షణ్ముగం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రసాయనిక ఎరువులకు స్వస్తిపలికి సేంద్రియ వ్యవసాయ పద్ధతులతో సాగుచేసిన పంటలను ఆహారంగా తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండగలమన్నారు. నారీ స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తున్న నాబార్డ్ రూరల్ మార్ట్ లో లభ్యమయ్యే ప్రకతి వ్యవసాయ ఆహార ఉత్పత్తులను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రామాపురంలో నాబార్డ్ సౌజన్యంతో నారీ స్వచ్ఛంద సంస్థ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని ఆ సంస్థ కార్యదర్శి రజిని అన్నారు. నాబార్డు రూరల్ మార్ట్ లో లభ్యమయ్యే ఆహార ఉత్పత్తులను ఆమె వివరించారు. ప్రకృతి వ్యవసాయ శాఖ అడిషనల్ డీపీఎం పట్టాభిరెడ్డి, ఏపీ మాస్ డైరెక్టర్ వినాయక రెడ్డి ,ఏవో స్రవంతి, నారీ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు గోపాల్ రెడ్డి, ఎఫ్ పీఓ డైరెక్టర్స్ పాల్గొన్నారు.

జగన్‌ను గద్దె దింపుతాం : రవినాయుడు

తిరుపతి (మంగళం) : రాష్ట్ర యువత భవిష్యత్‌ను తలకిందులు చేసిన సిఎం జగన్మోహన్‌రెడ్డిని ప్రజలు గద్దె దింపడానికి కలలు కంటున్నారని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడు అన్నారు. బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ చావును అడ్డు పెట్టుకుని జగన్మోహన్‌రెడ్డి రాజకీయం చేస్తున్నారన్నారు. అధికారం కోసం సొంత బాబాయిని హతమార్చారని, అధికారంలోకి వచ్చాక ఆ కేసు విచారణను ఎందుకు కొనసాగించలేదని ప్రశ్నించారు. వివేక హత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న అవినాష్‌రెడ్డిని ఎందుకు కాపాడాలని ప్రయత్నం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో టిడిపి, బిజెపి, జనసేన 163 స్థానాలతో అధికారంలోకి రావడం ఖాయమన్నారు. విలేకరుల సమావేశంలో పెరుమాళ్, మధు, శ్రీనుయాదవ్ పాల్గొన్నారు.



ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలి

ప్రత్యేక ప్రతిభావంతులకు యూత్ హాస్టల్లో ఆటల పోటీలు

ప్రజాశక్తి - తిరుపతి సిటి

సమాజంలో ప్రత్యేక ప్రతిభావంతులు వివక్షకు గురవుతున్నారని, కుంగిపోకుండా ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలని రాస్ ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం అన్నారు. యూత్ హాస్టల్లో ప్రత్యేక ప్రతిభావంతులకు బాలోత్సవం ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నడ్డి నారాయణ అధ్యక్షత వహించారు. బాలోత్సవం గౌరవ అధ్యక్షులు టెంకాయల దామోదరం, వ్యవస్థాపకులు మల్లారపు నాగార్జున మాట్లాడుతూ మానసిక వికలాంగులను కంటికి రెప్పలా కాపాడుతున్న నిర్వాహకులను అభినందించారు. మానసిక వికలాంగుల నిర్వహణ కేంద్రాలైన రాస్, పాస్, మనోవికాస్, బ్లూమాస్, అక్షయక్షేత్రం, అభయక్షేత్రం, భవిత కేంద్రాల నుంచి ఈ పోటీల్లో 200 మంది పాల్గొన్నారు. నిర్వాహకులు విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మురళీకృష్ణ, బాలకృష్ణమూర్తి, ప్రముఖ న్యాయవాది మట్టా పురుషోత్తమరెడ్డి, రోటరీ అధ్యక్షులు రాజకుమార్, చలపతి, మునిలక్ష్మి, తహసున్నీసా, ముఖేష్, రెడ్డెప్ప, రఫీ, ఒ.వెంకటరమణ పాల్గొన్నారు. ప్రథమ చికిత్స కేంద్రాన్ని సంకల్ప ఆస్పత్రి వారు ఏర్పాటు చేశారు.

జూన్ నెల శ్రీవారి కోటా విడుదల

ప్రజాశక్తి - తిరుమల

తిరుమల శ్రీవారి భక్తుల సౌకర్యార్థం జూన్ నెలకు సంబంధించి ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్న దర్శనం, ఆర్జితసేవా టికెట్లు, శ్రీవారి సేవ కోటా వివరాలు ఇలా ఉన్నాయి. 18వ తేదీ ఉదయం 10 గంటల నుండి 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల లక్కీడిప్ కోసం నమోదు చేసుకోవచ్చు. మార్చి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటలలోపు సొమ్ము చెల్లించి టికెట్లు ఖరారు చేసుకోవాల్సి ఉంటుంది. 21వ తేదీ ఉదయం 10 గంటలకు శ్రీవారి ఆర్జితసేవలైన కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవా టికెట్ల కోటాను విడుదల చేస్తారు. జూన్ 19 నుండి 21వ తేదీ వరకు జరుగనున్న జ్యేష్టాభిషేకం ఉత్సవంలో పాల్గొనేందుకు మార్చి 21న ఉదయం 10 గంటలకు భక్తులకు అందుబాటులో ఉంచుతారు. 21న మధ్యాహ్నం 3 గంటలకు శ్రీవారి వర్చువల్ సేవలైన కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవా టికెట్లు, దర్శన టికెట్ల కోటాను విడుదల చేస్తారు. 23న ఉదయం 10 గంటలకు అంగప్రదక్షిణం టోకెన్లు అందుబాటులో ఉంటాయి. 23న ఉదయం 11 గంటలకు శ్రీవాణి ట్రస్టు దాతల దర్శనం, గదుల కోటాను విడుదల చేస్తారు. 23న మధ్యాహ్నం 3 గంటలకు వద్ధులు, దివ్యాంగుల దర్శనటికెట్ల కోటాను విడుదల చేస్తారు. 25న ఉదయం 10 గంటలకు రూ.300/- ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లను భక్తులకు అందుబాటులో ఉంచుతారు. 25న మధ్యాహ్నం 3 గంటలకు తిరుమల, తిరుపతిలోని గదుల కోటాను విడుదల చేస్తారు. 27న ఉదయం 11 గంటలకు తిరుమల, తిరుపతిలోని శ్రీవారి సేవ కోటాను, అదేరోజు మధ్యాహ్నం 12 గంటలకు నవనీత సేవ కోటాను, మధ్యాహ్నం 1 గంటలకు పరకామణి సేవ కోటాను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతారు.

శ్మశానవాటిక నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

దశాబ్దాల కాలంగా మంగళం పరిధిలోని మిట్టగాంధీపురం గ్రామ ప్రజలు శ్మశాన వాటిక లేకుండా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సహకారంతో స్మశాన వాటిక నిర్మాణానికి నిధులు మంజూరు చేశారని మంగళం వైసిపి డివిజన్ అధ్యక్షులు ప్రళయకావేరి నారాయణరెడ్డి తెలిపారు. బుదవారం మంగళం-శెట్టిపల్లి మార్గంలో స్మశాన వాటికకు కేటాయించిన స్థలంలో గ్రామ పెద్దలు, యువతతో కలసి నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. దశాబ్దాల కల నెరవేర్చిన చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి రుణపడి ఉంటామని గ్రామ ప్రజలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ అధ్యక్షుడు భాస్కర్, గ్రామ పెద్దలు గురవయ్య, వెంకటముని, బాబు, మణి, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.






కవయిత్రి మొల్లకు నివాళి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

కవయిత్రి మొల్లకు కలెక్టర్ లక్ష్మీ శ నివాళి అర్పించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మొల్ల చిత్రపటానికి పూలమాల వేసి, పుష్పాంజలి ఘటించారు. కవయిత్రి మొల్ల 1440లో కడప జిల్లా గోపవరం గ్రామంలో జన్మించారన్నారు. మొల్ల రామాయణాన్ని అతి సులువైన పదాలతో తెలుగులో రాసి తన సరళమైన పదజాలాన్ని ఉపయోగించారన్నారు. రామాయణాన్ని తెలుగులో రాసిన తొలి కవయిత్రిగా పేరు తెచ్చుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బి సి సంక్షేమ అధికారి భాస్కర్ రెడ్డి, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి బాలకొండయ్య పాల్గొన్నారు.

తిరుపతిని రాజధాని చేయడమే లక్ష్యం: చింతామోహన్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)



తిరుపతిని రాజధాని చేయడమే తన లక్ష్యమని, ఎన్ని అడ్డంకులు ఎదురైనా పోరాడతానని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ స్పష్టం చేశారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని, మే 10న తిరుపతి రాజధానిగా శంకుస్థాపన చేస్తామన్నారు. బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డికి ప్రజలు అవకాశం ఇచ్చినా అస్తవ్యస్థ పాలనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మతతత్వాన్ని రెచ్చగొట్టేలా పరిపాలన చేస్తూ, ప్రభుత్వ వ్యవస్థను కార్పొరేట్లకు కట్టబెడుతోందన్నారు. ఎక్కడ తన లొసుగులు బయట పడతాయోనని మోడీ వద్ద జగన్మోహన్‌రెడ్డి లొంగిపోయాడన్నారు. చంద్రబాబు అవినీతి చిట్టా కూడా మోడీ వద్ద ఉండడంతో ఆయనా సరెండర్ అయ్యారన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి, రాష్ట్రంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్‌కు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ తిరుపతి పట్టణ అధ్యక్షులు గోపి, తేజవతి, శాంతి యాదవ్, మునిశోభ, షేక్ జావేద్, వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకం

ప్రజాశక్తి - బాలాయపల్లి : వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతి కుటుంబాన్ని సంక్షేమ పథకాలు అందిస్తున్నమని రాష్ట్ర అధికార మహిళ ప్రతినిధి రాయి దేవిక చౌదరి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఉన్న స్త్రీ శక్తి భవనం ప్రాంగణంలో ఆసరా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలాయపల్లి మండలంలోని 4వ విడత 2076 మందికి రూ.38.92500 లక్షలు వైఎస్సార్ చేయూత అందించారన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం జమునా రాణి, ఐసీడీఎస్ సీడీపీఓ శంషద్ బేగం, ఐసీడీఎస్ సూపర్ వైజర్ రాజేశ్వరి, సీసీ లు,విఓఎలు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి -ఏర్పేడు : అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు నల్లపాలెం శివయ్య అన్నారు. ఏర్పేడులో పోషణ పక్వాడలో భాగంగా సామూహిక సీమంతాలు అంగన్‌వాడీ సెంటర్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సర్పంచుల సంఘం అధ్యక్షుడు నల్ల పాలెం శివయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలను గర్భవతులు, బాలింతలు, కిషోర్ బాలికలు, చిన్న పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపరువైజరు బి భారతి, అంగన్‌వాడీ టీచర్స్, మహిళా పోలీస్, గర్భిణులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అభ్యర్థి బరిలో గానుగపెంట రమేష్

ప్రజాశక్తి -ఏర్పేడు: మండలంలోని పాతవీరాపురం గ్రామానికి చెందిన యువ సమాజ నిర్మాణ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్. గానుగ పెంట రమేష్‌కి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే అభ్యర్థిగా నవతరం పార్టీ అవకాశం కల్పించింది. ఈ అవకాశం కల్పించిన జాతీయ అధ్యక్షులు, వ్యవస్థాపకులు రావు సుబ్రహ్మణ్యంకి ధన్యవాదాలు తెలిపారు.

వైయస్‌ఆర్‌టియుసి జనరల్ సెక్రెటరీగా మురళి రెడ్డి

ప్రజాశక్తి - క్యాంపస్ : వైసిపి రాష్ట్ర అధ్యక్షులు, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం వైయస్సార్ టియుసి జనరల్ సెక్రెటరీగా ఆల్ యూనివర్సిటీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో రిజిస్ట్రార్ కార్యాలయ ఉద్యోగి కె.మురళిరెడ్డిని నియమించింది. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందినట్లు ఆయన వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల లో బోధనేతర సిబ్బంది సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానన్నారు. వైయస్సాఆర్‌ఆల్ యూనివర్సిటీ ఎంప్లాయిస్ రాష్ట్ర అధ్యక్షుడిగా రాష్ట్రంలోని పలు విశ్వవిద్యాలయాలను సందర్శించి అక్కడ బోధనేతర సిబ్బంది సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తానన్నారు. వైఎస్ఆర్సిపి రాష్ట్ర జనరల్ సెక్రటరీగా నియమించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయిలో వైఎస్ఆర్టియుసి కమిటీ అధ్యక్ష, కార్యదర్శులకు, సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. పలువురు వైఎస్ఆర్సిపి నేతలు, బోధన, బోధనేతర, విద్యార్థి సంఘాల నేతలు శుభాకాంక్షలు తెలిపారు.

పలు అభివృద్ధి భవనాలు ప్రారంభం

ప్రజాశక్తి-పాకాల: మండలంలో బుధవారం నిర్వహించిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే సతీమణి చెవిరెడ్డి లక్ష్మిరెడ్డి హాజరయ్యారు. మండలంలోని గాదంకి, ఇరంగారిపల్లి, పంటపల్లి, లింగనపల్లి, కె.వడ్డేపల్లి, ఆదెనపల్లి, పెద్ద బైనపల్లి, సామిరెడ్డిపల్లి పంచాయతీలలోని పలు గ్రామాలలో సిసి రోడ్లు, సమావేశ మందిరాలు, సచివాలయ భవనాలను, ఆర్వో ప్లాంట్, రైతు భరోసా కేంద్రాలను చెవిరెడ్డి లక్ష్మిరెడ్డి ప్రారంభించారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు స్థానిక వైసిపి నాయకుల సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గడచిని ఐదేళ్లలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ప్రతి గ్రామంలోనూ కోట్ల రూపాయలు అభివృద్ధి పనులు, తాగునీటి సమస్య తలెత్తకుండా బోర్లు వేశారని తెలిపారు. కరోనా కాలంలో వసతులు, సౌకర్యాలు ఏర్పాటు చేశా రన్నారు. రాబోయే ఎన్నికల్లో చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ, జెడ్పిటిసి, వైసిపి మండల కన్వీనర్, డివిజన్ అధ్యక్షులు, వైస్ ఎంపిపిలు, ఎంపీటీసీలు, స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్స్, ఏఎంసీ ఛైర్మన్ అండ్ డైరెక్టర్లు, ఆలయ ఛైర్మన్, కమిటీ మెంబర్స్, సింగిల్ విండో ఛైర్మన్ డైరెక్టర్లు, సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు మెంబర్లు, కో ఆప్షన్ మెంబర్లు, సచివాలయం కన్వీనర్లు, గృహ సారధులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన నాయకుల తీరుపై నిరసన

ప్రజాశక్తి - క్యాంపస్ : టీడీపీ, జనసేన సోషల్ మీడియా స్వార్థ రాజకీయాలకు బలైన గీతాంజలికి శాంతి చేకూరాలని.. ఆమె మృతికి కారకులైన ముష్కరులను కఠినంగా శిక్షించాలని కోరుతూ వైసిపి విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో బుధవారం రాత్రి తిరుపతి యూనివర్సిటీలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. వైయస్సార్ విద్యార్థి భాగం ఎస్ వి యూనివర్సిటీ అధ్యక్షులు మనం ప్రేమ్ కుమార్ నాయకత్వంలో ఎస్వీ యూనివర్సిటీ పరిపాలన భవన్ నుండి అంబేద్కర్ విగ్రహం వద్ద వరకు నిర్వహించిన ఈ ర్యాలీలో పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు. టీడీపీ, జనసేన నాయకుల తీరును విమర్శించారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ అసోసియేషన్ సెక్రటరీ డాక్టర్ వి ఎన్ కిషోర్ ,ఎస్వీ సెల్ ప్రేట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బి ఎస్ నాగరాజు , వైఎస్ఆర్ విద్యార్థి విభాగం పసుపులేటి సురేష్, వినయ్ రాయల్ ,బలరాం, విద్యార్థి నేతలు ముని ,నరేష్ ,నాగేంద్ర, సాయి, ప్రసన్న రవి ,పవన్ జెనిక్ పాల్గొన్నారు.



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి: సిఐ

ప్రజాశక్తి - బాలాయపల్లి : త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని వెంకటగిరి సిఐ సంగమేశ్వర రావు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని జయంపు, గొట్టికాడు, బాలాయ పల్లి గ్రామాలలో స్థానిక ఎస్ఐ మహబూబ్ సుభాన్ ఆధ్వర్యంలో కేంద్ర పోలీస్ బలగాలు కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంతరాలు లేకుండా ప్రత్యేక నిఘా పెట్టాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో కొత్తవారు తిరుగుతున్న వారిపై ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని కోరారు. బాలాయపల్లి మండలంలో ఎన్ని పోలింగ్ బూతులు ఉన్నాయో ప్రతి పోలింగ్ బూత్‌ను పరిశీలించి వాటికి కావలసిన వసతులు వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఎస్ఐకి ప్రత్యేకంగా ఆదేశించారు. ఈకార్యక్రమంలో కేంద్ర పోలీసు బలగాలు పాల్గొన్నారు.

తిరుపతి అభివృద్ధికి నిరంతర శ్రమ: టీటీడీ చైర్మన్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: తిరుపతి అభివృద్ధికి నిరంతరం తాము శ్రమిస్తూనే ఉంటామని టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి అన్నారు. నూతనంగా నిర్మించిన మాస్టర్ ప్లాన్ రోడ్ గోదావరి, కులశేఖర్ ఆళ్వార్ మార్గాలను బుధవారం ఉదయం ఆయన ప్రారంభించారు. ముఖ్య అతిథిగా, తిరుపతి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ అదితి సింగ్, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ ప్రారంభించారు. ముందు గోదావరి మార్గాన్ని ప్రారంభించిన తరువాత వేద విద్యార్థులు, పండితులు, పెద్దలు ఎలక్ట్రిక్ వాహనాల్లో మంత్రోచ్చారణ సాగిస్తూ కులశేఖర్ ఆళ్వార్ రోడ్డుకు చేరుకొని అక్కడ ఏర్పాటు చేసిన శిలాఫలకాలను, నేతాజీ సుభాష్ చంద్రబోస్, మహాత్మా చంద్రశేఖర్ ఆజాద్, భగత్ సింగ్, రాజ్ గురుల విగ్రహాలను, సెంట్రల్ లైటింగ్, సుందరీకరణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ డైరెక్టర్ భూమన సుబ్రహ్మణ్యం రెడ్డి, ఎస్.కె.యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్స్ లర్ కుసుమకుమారి, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు ఎస్.కె.బాబు, స్థానిక కార్పొరేటర్లు ఆధం రాధాకృష్ణ రెడ్డి, బోకం అనిల్, ఉమాఅజయ్, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు నరసింహాచారి పాల్గొన్నారు.

ఓటుహక్కు ప్రాముఖ్యతపై అవగాహన

ప్రజాశక్తి - క్యాంపస్ : మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్, మినిస్ట్రీ ఆఫ్ స్పోర్ట్స్ అండ్ యూత్ అఫైర్స్ సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న 'మేరా పెహల ఓట్ దేశ్ కేలియే క్యాంపెయిన్ ' లో భాగంగా ఎన్.ఎస్.ఎస్.రీజనల్ డైరెక్టర్ ఇచ్చిన పిలుపునకు, బుధవారం శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, ఎన్ఎస్ఎస్ యూనిట్ 3 కుంట్రపాకంలో నిర్వహిస్తున్న ప్రత్యేక సేవ శిబిరంలో ఓటు హక్కు ప్రాముఖ్యత పై అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉదా ప్రైవేట్ లిమిటెడ్ మోహన్ రెడ్డి విచ్చేశారు. ప్రజాస్వామ్యానికి పునాది ఓటు అనే సత్యాన్ని అందరూ తెలిపేలా ప్రేరణ కలిగించాలని ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను గ్రామస్తులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి యశోదమ్మ, జెడ్పీటీసీ రత్నమ్మ, సర్పంచ్ శుభ ప్రద నాభిరెడ్డి, పంచాయతీ సెక్రటరీ మురళి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా 'నారాయణ' వార్షికోత్సవం



సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి -శ్రీకాళహస్తి: స్థానిక నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో బుధవారం ఆ పాఠశాల వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే చెంచు రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. పిల్లలు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. విక్రమ్ హాస్పిటల్ అధినేత డాక్టర్ ప్రవీణ్ చంద్ర, ప్రముఖ న్యాయవాది ఉదయరావ్, ఎంఈఓ బాలయ్య, ఈశ్వరయ్య, ఏటీఎం కిషోర్ పాల్గొన్నారు.

గంగ లేక.. రైతన్నకు బెంగ!

చివరి తడి కోసం అగచాట్లు

ప్రజాశక్తి - ఓజిలి: తెలుగు గంగ నీరు రాక రైతులు బెంగ పడుతున్నారు. పంటలను కాపాడు కోలేక రైతాంగం ఆందోళన చెందుతున్నారు. చివరి తడి కోసం రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. రాత్రనకా, పగలనకా కంటికి రెప్పలా కాచుకుని వరి పంటలు సాగు చేస్తుంటే కళ్లెదుటే నీరు లేక పంట ఎండుతుంటే రైతు కళ్ళల్లో కన్నీటిధారలు కారుతున్నాయి. చెరువుల్లో నీరు అడుగంటడంతో వందల ఎకరాల్లో వరి ఎండిపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. పాలకులు సభలో హామీలు కురిపిస్తున్నారు తప్ప కార్యాచరణకు నోచుకోవడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రాజెక్టుల్లో నీరు ఉన్నా పంటలు ఎండిపోయే పరిస్థితులు నెలకొన్నాయి.

ఓజిలి మండల పరిధిలోని వందలాది ఎకరాల్లో వరి పైర్లు సాగు చేస్తున్న రైతులు నష్టపోయే ప్రమాదం ఏర్పడింది. ఆఖరి తడిలో పంట చేతికి వచ్చే సమయానికి చెరువుల్లో ఉన్న నీరు కాస్త అడుగంటి పోవడంతో నీళ్ల లేక వరి ఎండిపోతుండడంతో రైతన్నలు దిక్కుతోచని స్థితిలో ఆందోళనకు గురవుతున్నారు. వేలాది రూపాయలు అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టామని ఆఖరితడిలో నీళ్ల లేక వరి పైర్లు ఎండు ముఖం పట్టాయని ,తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలో అర్థం కాక అయోమయం స్థితిలో ఉన్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెలుగు గంగ ప్రాజెక్టు ద్వారా నీళ్లు అందించి ఆదుకోవాలని రైతులు ఆర్తనాదాలు చేస్తున్నారు. తెలుగు గంగ నీరు ఆఖరి తడికైనా వస్తాయనే నమ్మకంతో నే చెరువుల కింద వరి పైర్లు సాగు చేసామని రైతులు వాపోతున్నారు. వివిధ మండలాల్లో రాజకీయ బలంతో నాయకులు తమ తమ రాజకీయ పలుకుబడులను ఉపయోగించి తెలుగు గంగ నీళ్లను తమ తమ ప్రదేశాలకు తరలించకపోతున్నారని ఓజిలి మండలంలో మాత్రం ఆ పరిస్థితులు కనబడడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెలుగంగ నీరు రాకపోతే తీవ్ర నష్టాన్ని చవి చూడాల్సి వస్తుందని రైతులు గగ్గోలు పెడు తున్నారు. ఇప్పటికైనా సంబంధిత తెలుగు గంగ అధికారు లు స్పందించి రైతులకు నీళ్లు ఇచ్చి ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.



ఆర్‌అండ్‌బి రోడ్డుకు మరమ్మతుల్లేవ్!

- స్పందించని అధికారులు
- ప్రయాణికులు, విద్యార్థుల అవస్థలు

ప్రజాశక్తి- కేవిబిపురం: కెవిబిపురం మండలంలోని మారుమూల ప్రాంతమైన కోట , మంగాపురం రోడ్డు గతంలో కురిసిన తుపానుకు కొట్టుకుపోయింది. అప్పటి నుంచి మూడు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెళ్లడానికి దారి లేక పడరాని పాట్లు పడుతున్నారు. వాహనదారులు రాత్రి వేళలో వెళ్లాలంటే ఎప్పుడు ఏ పరిస్థితి ఎదురవుతుందోనని భయం గుప్పెట్లో పెట్టుకుని పొలాలపై వెళ్లాల్సి వస్తోంది. విద్యార్థులు పాఠశాలకు వెళ్లాలంటే రోడ్డు లేకపోవడంతో బస్సులు రాక సుమారు ఐదు కిలోమీటర్లు నడిచి వెళ్లి పుత్తూరుకు బస్సు ఎక్కాల్సిన దుస్థితి గ్రామంలో నెలకొంది. ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా ఏమాత్రం పట్టించు కోవడం లేదని విద్యార్థులు, ప్రయాణికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి బ్రిడ్జి ఏర్పాటు చేసి తమ గ్రామానికి బస్సు వచ్చేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.



తుపాను కారణంగా కొట్టుకుపోయిన బ్రిడ్జి

ఖజానా అధికారుల కక్ష

- ఆదాయపు పన్ను పరిధిలో లేనివారికి వేధింపులు
- అధికారులపై చర్యలు తీసుకోవాలి
- విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ధర్నా



జిల్లా ఖజానా కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రాష్ట్ర ఖజానా అధికారుల ఆదేశాలు విస్మరిస్తూ ఆదాయపు పన్ను పరిధిలో లేని వారి వద్ద సైతం జమ చేయాలని పుత్తూరు ఖజానా అధికారులు కక్ష సాధింపుతో వ్యవహరిస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ విశ్రాంత ఉద్యోగుల సంఘం తిరుపతి జిల్లా ఖజానా కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంతి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు భాస్కర్ రాజు మాట్లాడుతూ సుమారు 35 సంవత్సరాలు పాటు సమాజానికి వివిధ హోదాల్లో సేవలు అందించి విశ్రాంత జీవనంలో ప్రశాంతంగా జీవించాలంటే ప్రతినెల పెన్షన్ అవసరం అని, పెన్షనర్లు ఆదాయపు పన్ను పరిధిలోకి రాకపోయినా పుత్తూరు ఎస్‌టిఓ, వారి సిబ్బంది కక్ష సాధింపుతో వ్యవహరిస్తున్నారని వారి పై తక్షణం చర్యలు తీసుకొని పెన్షనర్లకు న్యాయం చేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఏపీఎస్‌జి కోశాధికారి, జిల్లా పుత్తూరు సంఘం నాయ కులు 50 మంది తిరుపతి జిల్లా ఖజానా కార్యాలయం వద్దకు చేరుకుని జిల్లా ఖజానా అధికారి ఎం లక్ష్మీకర్ రెడ్డిని కలిసి పుత్తూరు ఖజానా సిబ్బంది తీరును వివరించారు. గతంలో అనేక ఆదాయపు పన్ను రికవరీపై విజ్ఞప్తులు చేసినా వాటిని పట్టించుకోకుండా పుత్తూరు ఎస్‌టిఓ వ్యవహరిస్తున్నారన్నారు. ఆదాయపు పన్ను పరిమితి ఏడు లక్షల 50 వేల రూపాయల వరకు రికవరీ చేయకూడదని ఆదాయపు పన్ను చట్టాలలో ఉన్నా పాటించ కుండా వారికి న్యూ రెజిమ్ పన్ను చట్టాలు ప్రకారమే పన్ను రికవరీ చెయ్యాలని రాష్ట్ర ఖజానా అధికారులు చెబుతున్నా పట్టించుకో వడం లేదన్నారు. క్షుణ్ణంగా పరిశీలించి పన్ను నెలకు రూ.46వేల పెన్షన్ పొందుతున్న పెన్షనర్ కూడా 40 వేల రూపాయలు అక్రమంగా ఇన్‌కంటాక్స్ పేరుతో రికవరీ చేసి తీవ్ర మన వేదనను కలిగించా రన్నారు. వెంటనే చర్యలు తీసుకుని పెన్షనర్లకు న్యాయం చేయకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు కేఆర్ శంకర్, ప్రధాన కార్యదర్శి జయరాం నాయుడు, జిల్లా సహాధ్యక్షులు యుగంధర్ రాజు, టి గోపాల్, జిల్లా సంఘటన కార్యదర్శి రవిశంకర్ రాష్ట్ర మహిళా కార్యదర్శి కృపవరమ్మ, పుత్తూరు పెన్షనర్ల సంఘం నాయకులు కుప్పయ్య, గుణశేఖర్ రెడ్డి, అరుణాచలం రెడ్డి, మోహన శెట్టి, మురహరి, తిరుపతి నగర్ శాఖ ప్రధాన కార్యదర్శి వెంకటేశం శెట్టి, కోశాధికారి నగర శాఖ అధ్యక్షులు సి టి ఆర్ సురేష్ బాబు, ఎస్ జి మునికృష్ణ, కార్యవర్గ సభ్యులు సుబ్రహ్మణ్యం, పెన్షనర్ల సంఘం నాయకులు పాల్గొన్నారు.

జీవితంలో వైజ్ఞానికం వెలుగు లాంటిది

- డా.బి హితేంద్రనాథ్ రెడ్డి

ప్రజాశక్తి రామచంద్రాపురం (చంద్రగిరి): సంప్రదాయాలు, కట్టుబాట్లు, మూఢనమ్మకాలు వంటి చీకట్లో మగ్గిపోతున్న మానవ జీవితంలో వైజ్ఞానిక శాస్త్రం ఓ వెలుగులాంటిదని అనేకమంది జీవితాలలో వెలుగు నింపిందని బ్లూమింగ్ బడ్స్ అధినేత డాక్టర్ బి. హితేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. మన పిల్లలను ప్రోత్సహించటం ద్వారా భవిష్యత్తులో గొప్ప ఆవిష్కరణలు వచ్చి అవి మన దేశ పురోగతికి ఉపయోగపడతాయని ఆయన వివరించారు. బుధవారం స్థానిక చంద్రగిరి ఆర్.ఎఫ్ రోడ్ లోని బ్లూమింగ్ బడ్స్ పాఠశాలలో సైన్స్-ఎక్స్పో-2024 అనే వైజ్ఞానిక ప్రదర్శనను అంబరాన్ని అంటేలా అట్టహాసంగా నిర్వహించారు. చంద్రగిరి ఎంఇవో ఎస్.లలిత కుమారి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో విద్యార్థినివిద్యార్థులు తమ సైన్స్ నమూనాలను(సైన్స్ ప్రాజెక్టులు) ప్రదర్శించారు. ప్రధానంగా చంద్రయాన్ -3 ప్రాజెక్ట్, డ్రిప్ ఇరిగేషన్ సిస్టమ్, సేవ్ ఎర్త్ ప్రాజెక్ట్, ఎల్పీజీ ప్రొడ్యూసింగ్ సిస్టమ్, గ్రీన్ హౌసింగ్ ఆటోమేషన్, విండ్ పవర్ జనరేషన్ లాంటి భవిష్యత్తులో ఉపయోగకరమైన అనేక సాంకేతిక నమూనాలను విద్యార్థులు ప్రదర్శించారు. వీటిని మండల విద్యాశాఖ అధికారి ఎస్.లలిత కుమారి, , పిల్లల తల్లిదండ్రులు తిలకించి విద్యార్థుల నమూనాలను (ప్రాజెక్టులు) పరిశీలించి వాటి గురించి ఆడిగి తెలుసుకొని విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వేణుగోపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ,తల్లిదండ్రులు, స్థానికులు పాల్గొన్నారు.



వైజ్ఞానిక ప్రదర్శనను ప్రారంభిస్తున్న ఎంఇవో లలితకుమారి

ప్రతి గ్రామాన్నీ అభివృద్ధి చేస్తా: పులివర్తి నాని

ప్రజాశక్తి-యర్రావారిపాలెం: మండలంలో ప్రతి గ్రామాన్ని పట్టణ తరహాలో అభివృద్ధి చేస్తానని చంద్రగిరి నియోజకవర్గ టిడిపి అభ్యర్థి పులివర్తి నాని పేర్కొన్నారు. మండలంలో మూడు రోజులు పాటు 'మీ పల్లెకు మీ పులివర్తి నాని' అనే నినాదంతో జనసేన, టిడిపి కార్యకర్తలతో కలిసి 12 పంచాయ తీలలో ప్రతి పల్లెలో తిరుగుతున్నట్లు పులివర్తి నాని తెలిపారు. మండలంలోని టిడిపి జనసేన నాయకులు గజమాలతో సత్కరించి ఘనంగా స్వాగతం పలికారు. మొదట ఉస్తికాయలపెంట పంచాయతీలో నాని మాట్లాడుతూ రానున్న 2024 ఎన్నికలలో చంద్రగిరి నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. అధికారంలోకి రాగానే ప్రతి పల్లెను పట్టణ తరహాలో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఆర్లపెంట వంక ప్రాజెక్టును నిర్మాణం చేపట్టి తలకోన నీటిని నిల్వ చేసి పంటలకు అందేలా చూస్తామని తెలిపారు. పలువురు వైసిపి సానుభూతి పరులు టిడిపిలో చేరారు. ఐదు ఏళ్లలో అధికార పార్టీ చేసిన అవినీతి, అక్రమాలు భూ ఆక్రమణలు, ఇసుక మాఫియా, ఎర్రచందనం, అక్రమ రవాణా గురించి ప్రజలకు తెలిపి ప్రజల సంక్షేమం కోసం పాటు పడతామని తెలిపారు. టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు శక్తి వంచన లేకుండా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



టిడిపిలో చేరిన వైసిపి నాయకులు

నల్లపరెడ్డి వినోద్ కుమార్ రెడ్డి నివాసంలో మంత్రి పెద్దిరెడ్డి

ప్రజాశక్తి -కోట : మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ నేదురుమల్లి జనార్దన్ రెడ్డి విగ్రహావిష్కరణకు వాకాడు గ్రామానికి విచ్చేసిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కోట మండలంలోని వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నల్లపరెడ్డి వినోద్ కుమార్ రెడ్డి నివాసానికి వెళ్లారు. ఆయన రాకతో కోట క్రాస్ రోడ్డు వద్ద వైసిపి నాయకులు, కార్యకర్తలు, నల్లపరెడ్డి వినోద్ కుమార్ రెడ్డి అభిమానులు మేళా తాళాలు, బాణా సంచాలతో ఘనంగా ఆహ్వానం పలికి పూలమాలలు, శాలువాలతో ర్యాలీ నిర్వహించారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తో పాటు తిరుపతి ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ, గూడూరు ఇన్‌ఛార్జి మేరిగ మురళి, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తిలు ఆయన వెంట వున్నారు. అనంతరం ఇంటికి చేరిన తర్వాత నల్లపురెడ్డి వినోద్ కుమార్ రెడ్డి, పలువురు స్థానిక వైసీపీ నాయకులు మండల కన్వీనర్ పలగాటి సంపత్ కుమార్ రెడ్డి, కర్లపూడి సర్పంచ్ భర్త వైసీపీ సీనియర్ నాయకులు సన్నారెడ్డి, చెంచు రాఘవరెడ్డి, చెందోడు వైసిపి యువ నాయకులు చిల్లకూరు సాయిప్రసాద్ రెడ్డి, కోట బిట్‌టు ఎంపీటసీ షేక్ మొబిన్ బాష, కోట సర్పంచ్ ఇండ్ల వెంకట రమణమ్మ, అద్దాల శివ కుమార్ పెద్దిరెడ్డి రామ చంద్రా రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరిం చారు. అనంతరం వినోద్ కుమార్ రెడ్డి ఇచ్చిన తేనీటి విందు స్వీకరించారు. మంత్రి రాక విషయం తెలుసుకున్న పలువురు అక్కడికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నాయకులు యర్రటపల్లి మధుసూదన్ రెడ్డి, ఉప్పల ప్రభాకర్ గౌడ్, టింకర్ రవి, ఆనందమూర్తి పాల్గొన్నారు.



నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి నివాసానికి వెళ్లిన మంత్రి పెద్దిరెడ్డి

వైసిపి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: వైసీపీకే రాష్ట్రంలో సంక్షేమం సాధ్యమని... సత్యవేడు. అసెంబ్లీ స్థానం నుండి తనను గెలిపించి, మళ్లీ వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతో టిరాజేష్ పిలుపు నిచ్చారు. బుధవారం ఆయన మండలంలోని కనమనంబేడు, ఈ బీసీ కాలనీ, బీసీ కాలనీ వెంకటేశ్వర కాలనీలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పదవమైలు గ్రామం నుండి భారీ యూత్ బైక్ ర్యాలీతో కనమనంబేడు లోని వేమలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి.. ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఆయనకు నాయకులు ఘన స్వాగతం పలికి సన్మానించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలను అందజేసి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా వైసిపి సోషల్ మీడియా కో ఆర్డినేటర్ వేలూరు రాకేష్, సింగిల్ విండో ఛైర్మన్ హరనాథ్ రెడ్డి, జిల్లా వైసిపి ప్రధాన కార్యదర్శులు జొన్నల గోపాల్ రెడ్డి, మణినాయుడు, రవిరెడ్డి, గురునాథం, భానుప్రకాష్ రెడ్డి, సురుటుపల్లి దేవస్థానం సభ్యులు అజయ్‌కుమారెడ్డి, సర్పంచ్ జనార్ధన్, మాజీ సర్పంచ్ గురవయ్య, ఎంపిటిసి రవి, నాయకులు సాయినాయుడు, కోటేశ్వరరావు, జయచంద్రనాయుడు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న నూకతోటి రాజేష్

సదాశివకోన హుండీ లెక్కింపు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వడమాల పేట మండలం సదాశివ కోనలో మహాశివరాత్రి సందర్భంగా గుడికి భక్తుల ద్వారా హుండీ లో నగదును దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ ఛైర్మన్ ఎంఎ జయచంద్రన్ ఆధ్వర్యంలో బుధవారం హుండీ లెక్కించారు. ఈ సందర్భంగా హుండీ లెక్కింపులో రూ 12,36,000 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ ఏడాది మొదలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక , సాంస్కృతిక వ్యవహారాల యువజన సర్వీసులు క్రీడా శాఖ మంత్రి ఆర్ కె రోజా సెల్వమణి ప్రయత్నాలతో భక్తులకు సర్వదర్శనం ఏర్పాటు చేశామని తెలిపారు. తలనీలాలు, వెంట్రుకల వేలం ద్వారా 1,73,000 రూపాయిలు, అభిషేకం, సేవా టికెట్లు ద్వారా 1,97,000 రూపాయలు, అమ్మవారి కోన గుడి, శివాలయం గుడి హుండీ వసూలు 10,16,290. రూపాయలు. ఇందులో ఒకే వ్యక్తి ద్వారా రూ. 2,000 కరెన్సీ చెల్లని నోట్లు ఎలుకలు కొరికినవి 75 నోట్లు 1,50,000 రూపాయలు భక్తుల ద్వారా ఆదాయం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారి ఈవో కోటి రామచంద్రారెడ్డి, ఫెస్టివల్ స్పెషల్ ఆఫీసర్ సుబ్రమణ్యం నాయుడు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌ను కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి -కోట : కోట మండలంలోని దరువు కట్ట గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు మారంరెడ్డి శ్రీధర్ రెడ్డి, విద్యానగర్ గ్రామానికి చెందిన వాకా విజయభాస్కర్ రెడ్డిలు టిడిపి ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌ని బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం పలు విషయాలపై చర్చించారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ వారితో మాట్లాడుతూ రాబోవు ఎన్నికలలో చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిని చేయడానికి ప్రజలను చైతన్యవంతం చేయాలని, ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని పలు సూచనలు, సలహాలు అందించారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్: సర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని రోటరీ వెస్ట్ క్లబ్ ప్రతినిధులు పిలుపు నిచ్చారు. రోటరీ వారోత్సవాల్లో భాగంగా రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా సరస్వతి శిశు మందిరం పాఠశాలల్లో బుధవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. భవిష్యత్ తరాల కోసం మొక్కలు నాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు సనత్ కుమార్ రెడ్డి, ధనుంజయ రెడ్డి, ఎస్ఎల్ఎన్ బాబు, సుబ్రహ్మణ్యం, డిఆర్‌డబ్ల్యు కాలేజ్ ఎన్ఎస్ఎస్ పిఓ నాగలక్ష్మి, ప్రశాంతి, గాయత్రి పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసికోల్లాసం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : విద్యతో పాటు క్రీడలకూ జెమ్స్ స్కూల్ ప్రాధాన్యత ఇస్తుందని క్రీడల వల్ల మానసిక శారీరక ఉల్లాసం పెరుగుతుందని స్కూల్ ప్రిన్సిపాల్ శివకుమార్ రెడ్డి పేర్కొన్నారు. గూడూరు పట్టణంలో జెమ్స్ స్కూల్ వార్షికోత్సవ స్పోర్ట్స్ మీట్‌ను బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథి ప్రగతి సేవా సంస్థ అధ్యక్షులు చంద్రశేఖర్ క్రీడలను ప్రారంభించారు. ఉత్సాహంగా క్రీడా పోటీలు సాగాయి. స్కూల్ ప్రిన్సిపాల్ శివకుమార్ రెడ్డి మాట్లాడుతూ క్రీడలు వల్ల మానసిక, శారీరక ఉల్లాసం పెరుగుతుందని జెమ్స్ స్కూల్ విద్యతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమలాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రుచికరమైన భోజనం వడ్డించాలి: ఎంఇవో

ప్రజాశక్తి- కెవిబి పురం: ప్రభుత్వ పాఠశాల్లో అమలు అవుతున్న జగనన్న గోరుముద్ద మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని వంట నిర్వాహకులకు మండల విద్యాశాఖాధికారి లక్ష్మీపతి సూచించారు. ఇందులో ఎవరైనా అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు చేపట్టి వారిని తొలగిస్తామని హెచ్చరించారు. మండలంలోని రాజుల కండ్రిగ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలల్లో బుధవారం ఆయన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోంచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న గోరుముద్దలో మధ్యాహ్న భోజనాన్ని ప్రభుత్వ మెనూ ప్రకారం రుచికరమైన భోజనాన్ని అందించాలన్నారు. నిబంధనలు అనుసరించకపోతే చర్యలు తప్పని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి -వాకాడు: రాష్ట్ర రాజకీయాలకు ఎనలేని సేవలు అం దించిన నేత, మాజీ ముఖ్యమంత్రి జ్ఞాప కార్థం వాకాడు మండ లం లోని వాకా డు స్వర్ణముఖి బ్యారేజీ పరిసర ప్రాంతాల్లో నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి కాంస్య విగ్రహాన్ని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బుధవారం ఆవిష్కరించారు. రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డ్ ఛైర్మన్ నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి వారి తండ్రి జనార్ధన్ రెడ్డి కాంస్య విగ్రహం ఏర్పాటు చేశారు. విగ్రహవిష్కరణకు రామ్‌కుమార్ రెడ్డి ఆహ్వానం మేరకు రాష్ట్ర అటవీ శాఖ, పర్యావరణ, గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి. రామచంద్రారెడ్డి విచ్చేసి విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ టిడిపి నాయకులు 2024 ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా మోసపూరిత వాగ్దానాలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా గూడూరు నియోజక వర్గంలో మేరుగ మురళి, వెంకటగిరి నియోజక వర్గం రామ్ కుమార్ రెడ్డి లను గెలిపించుకోవాలని, జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేదురుమల్లి కుటుంబ సభ్యులు, ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి, గూడూరు నియోజకవర్గ సమన్వయ కర్త మేరుగ మురళి, సూళ్లూరుపేట, గూడూరు, వెంకటగిరి నియోజకవర్గాల వైసిపి నాయకులు కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం

ప్రజాశక్తి- ఏర్పేడు: మండలంలోని రాజుల పాలెం గ్రామ పంచాయతీలో కొత్త హరిజనవాడకు చెందిన మోరస పాపమ్మ కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మరణించారు. ఈ విషయం తెలుసుకున్న ఏర్పేడు మండల వైసీపీ ఇన్‌ఛార్జి గున్నేరు కిషోర్ రెడ్డి చేతుల మీదగా 10వేల రూపాయలు ఆర్థిక సాయం పాపమ్మ కుమారుడు మొరాస లక్ష్మయ్య అందించారు. ఆ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాజుల పాలెం సర్పంచ్ సుభాష్ చంద్రబోస్ , రాజులపాలెం రమేష్, వరదయ్య, తోకల సుబ్రహ్మణ్యం, రత్నయ్య,గ్రామస్తులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ

ప్రజాశక్తి -వెంకటగిరి: వెంకటగిరి పట్టణంలోని మున్సిపాలిటీ పరిధి 14 15 వార్డులలో ఇంటి స్థల రిజిస్ట్రేషన్ పత్రాలను జిల్లా గ్రంథలయ శాఖ చైర్పర్సన్ దొంతు శారద, 14 వ వార్డు కౌన్సిలర్ శంకరయ్య పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని రానున్న రోజుల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు విలువైన ఇంటి స్థలాన్ని ఉచితంగా ఇవ్వటమేకాకుండా రిజిస్ట్రేషన్ రుసుం లేకుండా రిజిస్ట్రేషన్ చేసి ఆ పత్రా లను ప్రతి లబ్ధిదారికే అంది స్తామన్నారు. ఈ పంపిణీ లో సచివాలయ సిబ్బంది లబ్ధిదారులు పాల్గొన్నారు.

విద్యుత్ ఘాతానికి షెడ్డు దగ్ధం

పజాశక్తి - పుత్తూరు టౌన్: పుత్తూరు పట్టణంలోని ఎంఎస్ఎం నగర్ వేదవ్యాస స్కూల్ వద్ద మూడంతస్తుల భవనం నిర్మించేందుకు తాత్కాలిక షెడ్డు నిర్మించారు. బుధవారం ఉదయం 7 గంటలకు విద్యుత్ ఘాతానికి, షెడ్డు పూర్తిగా దగ్ధమైంది. ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. ఫైర్ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని మంటలు అదుపు చేశారు.